క్లుప్తంగా

రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మహాత్మా గాంధీ బ్లడ్ సెంటర్ ఎమ్మిగనూరు వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని రెడ్‌రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్, పూర్వవిద్యార్థల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాలకు చెందిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు 42 మంది రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుసేన్‌బాషా,పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డి.సాల్మన్, అధ్యాపకులు డాక్టర్ కె.రాజన్న,మహేశ్వరరెడ్డి, బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకులు తిరుమల పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

వెలుగోడు: పీఆర్‌టీయూ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ జాన్ బాషా పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం ఎన్నికల అధికారిగా, రాష్ట్ర కార్యదర్శి పి.నూర్‌అహ్మద్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ మొయినుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా ఎం.అబ్దుల్ వహాద్, అసోసియేట్ అధ్యక్షుడుగా శ్రీకాంత్ రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా హాజిరాబీ, కార్యదర్శులుగా పి.బ్రహ్మం, షేక్ మౌలాలి, షంషాద్‌ను ఎన్నుకొన్నారు. అలాగే.. జిల్లా కౌన్సిలర్లుగా మునిరెడ్డి, ప్రసన్నకుమార్, మోమిన్ ఇస్మాయిల్, బాబూజీ నాయక్‌ను ఎన్నుకున్నారు.

ఆధార్ క్యాంప్ పరిశీలన

వెలుగోడు: ఆధార్ క్యాంపును సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని గిరిజన అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన స్పెషల్ ఆధార్ క్యాంపును పరిశీలించారు. అలాగే పట్టణంలో ఒకటి,రెండు,ఐదు సచివాలయాలను తనిఖీ చేసి హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే పురోగతి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

14న నేషనల్ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి దివ్య

నందికొట్కూరు: డిసెంబరు 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి వీ.దివ్య సూచించారు. బుధవారం పట్టణంలోని కోర్టు ఛాంబర్‌లో పోలీసులు, ఎక్సైజ్ సిబ్బందితో సమావేశంలో మాట్లాడారు. రాజీ కాదగిన కేసులు, ఎక్సైజ్ కేసులను రాజీ మార్గంలో పరిష్కారానికి కృషి చేయాలని పోలీసులకు సూచించారు. సీఐలు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఎస్ఐలు లక్ష్మి నారాయణ, తిరుపాల్, ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి వీ.దివ్య ఆదేశించారు. బుధవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో అడ్వకేట్లు, మహిళలు, మెప్మా గ్రూప్ మెంబర్స్, సోషల్ వర్కర్స్‌తో బాల్య వివాహ ముక్తి భారత్ ప్రతిజ్ఞ చేయించారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పగిడ్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని జూపాడుబంగ్లా డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజినాయక్ సూచించారు. బుధవారం మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లోని పశుగణాభివృద్ధి కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. నిర్ణీత గడువులోగా 21వ జాతీయ పశు గణన సర్వేను పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. జాతీయ బ్రూసెల్లోసిత వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా నవంబర్ 19 నుంచి డిసెంబర్ 20 వరకు 4 నుంచి 8 మాసాల పెయ్య దూడలకు టీకాలు వేసి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసీ అశోక్, వీఏఏ వీరేష్ తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపునకు రంగం సిద్ధం

మహానంది: మహానంది గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజును తొలగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఆయన్ను తొలగించాలని కొందరు స్థానిక టీడీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. సదరు ఫీల్డ్ అసిస్టెంట్ కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆర్థిక సహాయం చేశారు. సహాయం పొందడం నేరమన్నట్లు స్థానిక నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని పట్టుబట్టడంతో ఈ నెల 12న బుక్కాపురంలో సామాజిక తనిఖీ కార్యక్రమం ముగిసిన అనంతరం బలవంతంగా రాజీనామా లేఖ రాయించుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఏపీఓ మనోహర్‌ను సంప్రదించగా అధికారికంగా రాజీనామా లేఖ అందలేదని చెప్పారు.

రోడ్డు ఛిద్రం.. ప్రయాణం నరకం

- గుంతలమయంగా మారిన కృష్ణరావుపేట-మిట్టకందాల రోడ్డు
- భారీవాహనాల రాకపోకలతో దెబ్బతిన్న బీటీ రోడ్డు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- కన్నెత్తిచూడని అధికారులు



తారు లేచిపోయి గుంతలమయంగా మారిన కృష్ణరావుపేట-మిట్టకందాల రోడ్డు



రోడ్డుపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలు

జూపాడుబంగ్లా: రోడ్లపై గుంతల్లేని ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొంటున్న కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు మండలంలోని గ్రామాల రోడ్లు కనిపించవా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.8 కోట్ల నిధులు వెచ్చించి నిర్మించిన కృష్ణరావుపేట-మిట్టకందాల బీటీ రోడ్డు ఛిద్రమై ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, పర్యవేక్షణాధికారులు, కాంట్రాక్టర్లు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రూ.8 కోట్ల నిధులను వెచ్చించి కృష్ణరావుపేట నుంచి మిట్టకందాల వరకు 11.20 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును నిర్మించారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన స్వాతి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి చెందిన కాంట్రాక్టర్లు ప్రారంభంలోనే రోడ్డును నాసిరకంగా నిర్మించినా అధికారులు నామమాత్రంగా పర్యవేక్షించారనే ఆరోపణలున్నాయి. హైవే రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న పీఎస్‌కే కంపెనీ టిప్పర్లు కృష్ణరావుపేట-మిట్టకందాల రోడ్డులో అధిక లోడుతో తిరుగుతున్నాయి. దీంతో రోడ్డు ఛిద్రమై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో కృష్ణరావుపేట నుంచి కోల్స్‌ఆనందాపురం, రామసముద్రం, కొత్తసిద్ధేశ్వరం, మిట్టకందాల, పారుమంచాల, తరిగోపుల గ్రామాలకు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2021 అక్టోబర్‌లో రోడ్డు నిర్మాణం పూర్తయినప్పటికీ 2021 నవంబర్ నుంచి 2026 వరకు రూ.44.66 లక్షల నిధులు కేటాయించి ఐదేళ్ల పాటు రోడ్డు నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్లకే అప్పగించారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కృష్ణరావుపేట నుంచి మిట్టకందాల వరకు నిర్మించిన 11.20 కిలోమీటర్ల రోడ్డును 2021 నవంబర్ 25 నుంచి 2026 నవంబర్ 24 వరకు స్వాతికన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్లు, పంచాయతీరాజ్‌శాఖ ప్రాజెక్టు (పీఐయు) అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాల్సి ఉన్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని కృష్ణరావుపేట, కోల్స్‌ఆనందాపురం, రామసముద్రం, కొత్తసిద్ధేశ్వరం, మిట్టకందాల, తరిగోపుల, పారుమంచాల గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంతలమయంగా కృష్ణరావుపేట - మిట్టకందాల రోడ్డు



అధికలోడుతో వెళుతున్న పీఎస్‌కే టిప్పర్

అధికారులు, కాంట్రాక్టర్ల పర్యవేక్షణ లోపించటంతో కృష్ణరావుపేట-మిట్టకందాల రోడ్డు ఛిద్రమైంది. ఈ రోడ్డుపై సామర్థ్యానికి మించి అధిక లోడుతో పీఎస్‌కే కంపెనీకి చెందిన భారీ టిప్పర్లు తిరుగుతుండటంతో గుంతలమయంగా మారింది. దీంతో కృష్ణరావుపేట నుంచి మిట్టకందాలకు వెళ్లే ఆటోలు, ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని గుంతలమయంగా మారిన రోడ్డును బాగుచేయించాలని కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..

నేను రామసముద్రం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్నాను. నిత్యం బైక్‌పై కృష్ణరావుపేట నుంచి రామసముద్రం గ్రామానికి వెళ్లి వస్తుంటాను. రోడ్డుపై అధిక లోడుతో టిప్పర్లు తిరుగుతుండటంతో దెబ్బతిని గుంతలమయంగా మారింది. ప్రయాణంలో ఏమాత్రం ఆదమరిచినా కిందపడి గాయాలపాలు కావాల్సిందే. – రసూల్, టీచర్, రామసముద్రం

రోడ్డును బాగు చేయించాలి

కృష్ణరావుపేట నుంచి మా గ్రామం మీదుగా మిట్టకందాల వరకు వేసిన రోడ్డు బాగుండేది. పీఎస్‌కే కంపెనీకి చెందిన టిప్పర్లు మట్టి కోసం రోడ్డు వెంట తిరుగుతున్నాయి. దీంతో రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. రోడ్డును బాగుచేయించి సమస్య పరిష్కరించాలి. – లక్ష్మీనారాయణ, కొత్తసిద్ధేశ్వరం

మహానందిలో కొనసాగుతున్న భక్తజన సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న భక్తులు



కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

మహానంది: కార్తీక మాసం సందర్భంగా మహానందిలో భక్తుల సందడి కొనసాగుతోంది. బుధవారం ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ కనిపించింది. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవారికి అష్టవిధ మహామంగళ హారతులు చేపట్టారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారికి నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో ఏకాంతసేవ పూజలు జరిగాయి.

మహానందిలో నేడు నందీశ్వరాభిషేకం

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో గురువారం సాయంత్రం ప్రదోష కాలంలో నందీశ్వరుడికి అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగే నందీశ్వరాభిషేకం కార్యక్రమంలో పాల్గొనాల్సిన భక్తులు మధ్యాహ్నం 3.30 గంటలకు ఆలయంలో ఉండాలని సూచించారు.

సాధారణ కాన్పులకు ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రి భేష్



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ జఫ్రుల్లా

ఆత్మకూరు: సాధారణ కాన్పులకు ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రి నిలయం అని నంద్యాల జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డాక్టర్ జఫ్రుల్లా అన్నారు. బుధవారం ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, ఎఫ్ఆర్ఎస్, అటెండెన్స్, ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవలు, ఫార్మసీ, ల్యాబ్, మాతాశిశు సేవలు, శానిటేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ఆస్పత్రిలో మందులు ఉన్నవే రోగులకు రాయాలని చెప్పారు. ఆస్పత్రిలో 30 కాన్పులు చేయాల్సిన టార్గెట్‌కు 36 కాన్పులు చేయడం, 36 కాన్పులకు గానూ నాలుగు మాత్రమే సిజేరియన్ చేసి, 32 నార్మల్ డెలివరీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయుడు, వైద్యసిబ్బందిని అభినందించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాయుడు, డాక్టర్ లక్ష్మిప్రసన్న, డాక్టర్ షౌకత్ ఖదీర్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ అనుపమ, హెడ్ నర్సింగ్ ఆఫీసర్ వసంత, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య, ఎస్‌టీఎల్ఎస్ సౌజన్యరాణి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

వెలుగోడు: విధుల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్ జఫ్రుల్లా అన్నారు. బుధవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి వైద్యాధికారి ఇక్రమ్ అలిఖాన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్,ఫార్మసీ,క్యాజువాలిటీలను సందర్శించి చికిత్స పొందుతున్న పేషెంట్లను అడిగి వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఎమర్జెన్సీ కేసులు వచ్చినప్పుడు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. వైద్యాధికారులు వేణుగోపాలకృష్ణ, భానుప్రకాష్, సులోచన ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

పాములపాడు: దీర్ఘకాళికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. బుధవారం మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, డీఏ అమలు చేయాలని, సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబరు 21, 22 తేదీల్లో జిల్లా స్థాయిలో ధర్నా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు ఆనంద్, కార్యదర్శి అంబయ్య, జిల్లా కౌన్సిలర్ రామ్మూర్తి పాల్గొన్నారు.

పంట కోతలు వాయిదా వేసుకోండి

కొత్తపల్లి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని రైతులు పంట కోతలను వాయిదా వేసుకోవడం మంచిదని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ సూచించారు. బుధవారం మండల పరిధిలోని పాత మాడుగుల, ఎర్రమఠం, ముసలమడుగు గ్రామాలలో పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు. తుపాను ప్రభావం తగ్గేవరకు వరి, మినుము రైతులు కోతలు చేపట్టరాదన్నారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతులే విత్తనాలను ఉత్పత్తి చేసుకోవాలి

వెలుగోడు: రైతులు స్వయంగా విత్తనాలను ఉత్పత్తి చేసుకోవాలని, గ్రామానికి కావలసిన విత్తనం గ్రామ స్థాయిలోనే తయారు చేసుకోవాలని నంద్యాల డీఆర్సీ ఏఓ హేమలత తెలిపారు. మండలంలోని బోయరేవుల గ్రామంలో బుధవారం ఏవో పవన్ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని గ్రామ విత్తన ఉత్పత్తి పథకం గురించి వివరించారు. బొయిరేవుల,వేల్పనూరు,వెలుగోడు గ్రామాల్లో ఖరీఫ్ 2024 వరి పంట సీడ్ విలేజ్ ప్రోగ్రాం గ్రామ విత్తన ఉత్పత్తి పథకం అమలు చేస్తున్నామని, క్షేత్ర స్థాయిలో ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడానికి ఇది ప్రభావవంతమైన మార్గం అన్నారు. గ్రామ సభ అనంతరం గ్రామీణ విత్తన ఉత్పత్తి క్షేత్రాలను పరిశీలించారు.

కొణిదేలలో 'పొలం పిలుస్తోంది'

నందికొట్కూరు: మండల పరిధిలోని కొణిదేల పొలిమేరలో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రబీలో శనగ, మినుము పంటల సాగుపై డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు విజయశేఖర్, షేక్షావలి, సిబ్బంది రైతులకు పలు సూచనలు చేశారు. అలాగే పంట బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని, శనగ, మినుము పంటలు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలన్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంట మార్పిడి, అధిక ఉత్పత్తి వంగడాల సాగుతో లాభాలను ఆర్జించవచ్చన్నారు. రైతులు పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాతో పాటు రైతు సేవా కేంద్రం నుంచి పంటసాగు ధ్రువీకరణ పత్రం తీసుకొని నిర్దేశించిన ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

వెలుగోడు: ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, అవాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు మొహమ్మద్ రఫీతో సమావేశమై మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి రెండుసార్లు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఏటా 24 నుంచి 25 శాతం ఎరువుల ధరలు పెంచుతున్నారే తప్ప వరి ధాన్యానికి ఇచ్చే మద్దతు ధర తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగోడు రిజర్వాయర్‌లో జూన్ వచ్చేవరకు ఐదు టీఎంసీలు నీరు నిల్వ ఉంచాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు నాగమోహన్ పాల్గొన్నారు.

దేవస్థాన విభాగాధిపతులకు అదనపు విధులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆయా విభాధిపతులుగా విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులకు అదనపు విధులు కేటాయిస్తూ శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆర్.రవణమ్మకు అదనంగా అన్నప్రసాద విభాగాన్ని కేటాయించారు. సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డికి రెవెన్యూ, ఉభయ దేవాలయా ల పర్యవేక్షణ, ఏఈవో ఐ.ఎన్.వి.మోహన్‌కు సిద్దవటం, జ్యోతిస్దివటం దేవస్థానాల పూర్తి భాద్యత, ఎం.హరిదాసుకు వీరశైవ ఆగమ పాఠశాల, హేమారెడ్డి మల్లమ్మ ఆలయ పర్యవేక్షణ, పంచమఠాల పర్యవేక్షణ విధులు అదనంగా కేటాయించారు. పరిపాలన సౌలభ్యం కోసం అదనపు విధులు కేటాయించినట్లు ఈఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చిన్నారులకు యూనిఫాం అందజేత

పాములపాడు: స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం నంబర్-4లో చిన్నారులకు ఉప సర్పంచు జీవన్‌కుమార్ రెడ్డి సొంత ఖర్చుతో యూనిఫాంలు పంపిణీ చేశారు. బుధవారం నూతన భవనం ప్రారంభం సందర్భంగా సెంటర్‌లోని 25 మంది చిన్నారులకు రూ.15 వేల ఖర్చుతో యూనిఫాంలు అందజేశారు. పిల్లల కొత్త దుస్తులను అందుకుని మురిసిపోగా తల్లిదండ్రులు, కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

అపరిచితులతో జాగ్రత్త

కొత్తపల్లి: బాలికలు కొత్తవ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ కేశవ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి హైస్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడవద్దని సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రధానోపాధ్యాయులు వాసుదేవ రెడ్డి, కృష్ణాబాయి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

వెలుగోడు: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. శిల్పా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాపై అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, జనవరిలో జగనన్న నియోజకవర్గాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. వరి ధాన్యానికి కనీస మద్దతు లేకపోవడం, కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. అంతకుముందు మోత్కూరు గ్రామంలో పార్టీ నాయకుడు నాగేశ్వరరెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.అలాగే అబ్దుల్లాపురం గ్రామంలో మాజీ సింగల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డిని పరామర్శించారు. శిల్పా భువనేశ్వర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, సర్పంచ్ వేల్పుల జైపాల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య బుధవారం ప్రారంభించారు. నాబార్డు నిధులు రూ.11.20 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఎదిగేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే పాములపాడుకు చెందిన మొల్ల గఫూర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.లక్ష చెక్కును అందించారు.

భవనాశిపై వంతెన నిర్మించాలి

మండలంలోని ఇస్కాల గ్రామ సమీపంలో భవనాశి నదిపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తొగురు సరోజినీ వర్ణీనియ ఎమ్మెల్యేను కోరారు. వంతెన లేకపోవడంతో ఇస్కాల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఎంపీపీ తొగురు జరోజినీ వర్ణీనియ, సర్పంచు మేకల బాగ్యమ్మ, ఎంపీటీసీ నల్లమల రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

జూపాడుబంగ్లా: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య బుధవారం మధ్యాహ్నం పరిశీలించారు. తహశీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌తో మాట్లాడి మండలంలోని రెవెన్యూ సమస్యల గురించి ఆరా తీశారు. 80బన్నూరు గ్రామంలో శ్మశానవాటిక సమస్యను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. జాతీయ రహదారి 340సీ నుంచి తాటిపాడు గ్రామానికి రాకపోకలు సాగేలా సర్వీసు రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని సర్పంచ్ వంగల లక్ష్మిదేవి ఎమ్మెల్యే, తహసీల్దార్‌ను కోరారు.

గ్రామానికి సర్వీసు రోడ్డు నిర్మించాలి



ఎన్‌హెచ్ - 340సీ పనులను అడ్డుకొని ధర్నా చేస్తున్న తాటిపాడు గ్రామస్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు సమీపంలో రాకపోకల సౌకర్యార్థం సర్వీసు రోడ్డు నిర్మించాలని ఆ గ్రామస్తులు బుధవారం ధర్నా నిర్వహించారు. గ్రామ సమీపంలో జాతీయ రహదారి పనులను గంటపాటు అడ్డుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి సమీపంలో 20 అడుగుల ఎత్తులో ఎన్‌హెచ్ 340సీ రోడ్డును నిర్మించడంతో తమ గ్రామానికి రాకపోకలు స్తంభించిపోయే అవకాశం ఉందన్నారు. గ్రామరైతులు విక్రయించిన ధాన్యం బయటకు తరలించాలన్నా, ఎత్తిపోతల పథకం వద్దకు సామగ్రి తీసుకెళ్లాలన్నా సర్వీసు రోడ్డు లేకపోతే ఇబ్బందులు తప్పవని వివరించారు. జిల్లా అధికారులు చర్యలు చేపట్టి సర్వీసు రోడ్డు నిర్మించేలా కృషి చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జూపాడుబంగ్లా తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ వంగల లక్ష్మిదేవమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక తిరుమలేశ్వరరెడ్డి, వంగల కృష్ణారెడ్డి, లక్ష్మన్నగౌడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను వ్యతిరేకించండి



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరురూరల్: బాల్యానికి పెను హానిగా మారే బాల్య వివాహాలను వ్యతిరేకించాలని ,చట్టప్రకారం నేరమైన ఇలాంటి సామాజిక రుగ్మతను దునుమాడాలని ఆత్మకూరు మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర న్యాయసేవా సాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ×బాలవివాహ ముక్త్ భారత్ ।ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాల వల్ల బాలికల విద్య,రక్షణ, ఆరోగ్యం వంటివి దూరమవుతాయని అది వారి అభివృద్ధికి ఆటంకమవడమే కాకుండా వారు తమ కలలను సాకారం చేసుకునే అవకాశాలను కోల్పోతారన్నారు. అందువల్ల బాల్య వివాహాలనుంచి బాలికలను రక్షించాలని చెప్పారు. విద్యార్థినులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. న్యాయవాది మాణిక్యరావు, ఉప ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని వెలుగు సీసీలు గాంధీ, జయలక్ష్మి, ధన్సింగ్‌నాయక్, దేపాల్ తెలిపారు. బుధవారం బాల్య వివాహ రహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని జూపాడుబంగ్లాలో కీర్తి, అరుణోదయ గ్రామైఖ్య సంఘాలల పాదుపు మహిళలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బాలికలకు 18 ఏళ్లు, యువకులకు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు.

బండి ఆత్మకూరు : బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ×బాల వివుక్త భారత్¤ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. హెల్త్, ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో ఆయా గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను గ్రామస్తులకు వివరించి, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాల నిర్వహణలో భాగంగా శ్రీశైల దేవస్థానం కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించింది. బుధవారం దేవస్థాన పరిధిలోని రుద్రపార్కులో నిర్వహించిన వన భోజనాల కార్యక్రమానికి దేవస్థానంలోని అన్ని విభాగాల అధికారులు, పలువురు సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. సంప్రదాయాన్ని అనుసరించి రుద్రవనంలోని ఉసిరిచెట్టుకు పూజాధికాలు చేపట్టారు. అనంతరం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్ మాట్లాడుతూ వైదిక సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా, ఆలయ సంప్రదాయాలపై అందరికీ అవగాహన కల్పించేందుకు వనసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

శ్రీశైలంలో హిందూ సమ్మేళనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో మండల విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం దేవస్థాన పరిధిలోని యాంఫీ థియేటర్ వద్ద హైందవ శంఖారావం పేరుతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్తీకమాసం సందర్భంగా మండల పరిధిలోని హిందువులతో కలిసి దీపోత్సవ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సభ్యులు యుగంధర్ పాల్గొని మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.